కథ

**శివల పద్మ**

# అమ్మాయంటే అమ్మ కాదా!

"నువ్వెన్నిసార్లు అడిగినా ఇదే నా సమాధానం. ఇదే నా నిర్ణయం... అట్టే వాదించక వెంటనే వెళ్లి అబార్షన్ చేయించుకో... ఐ డోంట్ వాంట్ దట్ చైల్డ్..."

నిష్కర్షగా చెప్పాడు జగన్నాథ్.

ఫోన్ పట్టుకొని నిస్సహాయంగా ఉండిపోయింది జాహ్నవి.

"మీరెందుకింతలా మొండి పట్టు పడుతున్నారు? మిగతా ముగ్గురూ మగపిల్లలేగా? ఒక్క ఆడపిల్లని పెంచలేమా? మనం కావాలనుకోలేదు. ఏదో అయిపోయింది. సరే... పసిగుడ్డుని చంపి పాపం మూటకట్టుకోవాలా?"

"ఈ సెంటిమెంటల్ డైలాగులకేం? అందరూ చెప్తారు. మోసేవాడికి తెలుస్తుంది భారం... మనకెందుకూ పనికిరాకుండా ఏదో ఒకరోజు పరాయింటికి వెళ్లిపోయే పిల్లని కని, పెంచి దానిమీద ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. ఆడపిల్లల వలన ఎలాంటి ఉపయోగం లేదు. నీకంత ముచ్చట ఉంటే అన్నయ్య పిల్లలు, తమ్ముడి పిల్లలూ ఉన్నారుగా- వారితో తీర్చుకో. అంతే గానీ నా నెత్తిన పెట్టకు. నాకు స్థోమత లేదు. నేను పెంచలేను. అంతే..."

"నేనెవరిని కనాలో నిర్ణయించే హక్కు మీకే ఉందా? తల్లిగా నాకు లేదా?" నెమ్మదిగానే అయినా పదునుగా అడిగింది జాహ్నవి. ఈ వివక్షకి ఆమె లోలోన మరిగిపోతోంది.

"ఎందుకు లేదూ? ఉంది. దాన్ని తీసుకుపోయి స్వంతంగా పెంచుకుంటానంటే నీ హక్కు నువ్వు వాడుకోవచ్చు. నాతో ఉండడానికి వీల్లేదు."

ఆ గొంతులో దాష్టికానికి, అహంకారానికి నివ్వెరపోయింది జాహ్నవి.

జీవితాన్ని పంచుకున్న భార్య అభిప్రాయానికి ఎలాంటి విలువా లేదు. తన రక్తం పంచుకుని భూమ్మీదకి రావాలని తపన పడుతున్న ఆ పసిప్రాణం మీద ఎలాంటి మమకారం లేదు. ఎందుకంటే ఆమె 'ఆడపిల్ల' కనుక!

అందుకే నిర్దాక్షిణ్యంగా చంపేయమంటున్నాడు. పుట్టబోయేది తన ప్రతిరూపం అనే ఫీలింగ్ ఏ కోశానా లేదు.

"నెక్స్ట్ టైమ్ నేను ఫోన్ చేసినప్పుడు 'అంతా అయిపోయింది' అనే మాట వినాలి నీ నోటి నుంచి... అది తప్పు ఇంకేం వినను నేను. అర్థమైందా?" టక్కున ఫోన్ కట్ చేశాడు జగన్నాథ్.

నిస్త్రాణగా సోఫాలో వాలిపోయింది జాహ్నవి. తలుచుకుంటే దుఃఖం ముంచుకువస్తోంది.

ఏం పాపం చేసిందని దాన్ని గర్భంలోనే హతమార్చాలి? ఈ ప్రపంచంలోకి వచ్చే హక్కు దానికెందుకు లేదు? ఇతడెవరు దాని హక్కుని కాదనడానికి? తండ్రయితే అయ్యాడు... ముగ్గురు మగపిల్లలని గర్వంగా పెంచుకున్న చోట ఒక్క ఆడపిల్లకి పిడికెడు ముద్ద పెట్టలేమా?

నిజంగా స్థోమత లేదా? లేకపోతే ఉన్నదే పెట్టాలి. అసలు ఆడదాన్ని ఈ ప్రపంచంలోనికి రాకుండా చేయడానికి సమాజంలో ఎవరికి హక్కుంది? మధ్యలో మగవాడెవడు, తను పుట్టాలో వద్దో నిర్ణయించడానికి?

ఫోన్ మ్రోగితే అందుకుంది జాహ్నవి.

"జానీ! నేను సుధని... ఏమైంది? మాట్లాడావా?"

"మాట్లాడాను."

"ఏమైనా మార్పు వచ్చిందా?"

"తనలో కాదు, నాలో వచ్చింది. ఇకపైన తనను ఒప్పించేందుకు ప్రయత్నించను."

"మరి?"

"బిడ్డని... కంటాను..." నొక్కి చెప్పింది పట్టుదలగా.

"కానీ... అదెలా సాధ్యం?"

"ఏం లేదు. తను మస్కట్ నుంచి రావడానికి ఏడాది పడుతుంది. ఈలోగా నా డెలివరీ అయిపోతుంది. అంతవరకూ తనకి చెప్పను. నేను అబార్షన్ చేయించుకోను" గొంతు రుద్ధమైంది జాహ్నవికి.

"నాకర్థం అవుతోందే... కానీ జగన్నాథ్ సంగతి నీకు తెలుసు. సాహసం చేస్తున్నావేమో అని..."

"ఆడది తన బిడ్డని కాపాడుకోవడం- కడుపులో పడిన బిడ్డని కనడం కూడా సాహసం అయితే అదీ ఓ బ్రతుకేనా? పరిణామాలను నేను ఫేస్ చేస్తాను. అంతే కానీ పసిగుడ్డుని చంపుకోను. ఇది నా నిర్ణయం..." స్థిరంగా చెప్పింది జాహ్నవి.

ఒకసారి ఒక నిర్ణయానికి వచ్చాక తనలోని అలజడి మొత్తం చేత్తో తోసేసినట్లయిందామెకి.

తర్వాత ఫోన్ చేసి "ఏం చేశావ్? అంతా అయిపోయిందా?" అని అడిగాడు జగన్నాథ్.

"ఆ... అయింది..." పొడిగా చెప్పింది.

అతడేం రెట్టించలేదు. భార్యని ఎంత భయంలో ఉంచాడంటే తను చెప్పినదానికి వ్యతిరేకంగా అవుతుందని అతడు కలనైనా తలవడు.

నెలలు నిండాక డెలివరీ అయి చందమామ లాంటి పిల్ల చేతుల్లోకి రాగానే పొంగిపోతూ గుండెకి హత్తుకుంది.

"తల్లీ! నిన్నేనా నీ తండ్రి చంపాలనుకున్నది! ముద్దులొలికే ఈ ముఖం చూస్తే తను మాత్రం మైమరచిపోడూ! తన కోపం విముఖత అన్నీ మరచిపోడూ! నట్టింట నడయాడే మహాలక్ష్మిని మమకారంతో అక్కున చేర్చుకోడూ!" దాని బుగ్గలు నిమురుతూ మురిసిపోయింది జాహ్నవి.

తన ప్రాజెక్టు పూర్తవ్వడంతో అనుకున్న సమయాని కన్నా ముందుగానే వచ్చిన జగన్నాథ్ నెలల బిడ్డతో భార్య ఎదురుపడగానే నిర్విణ్ణుడయ్యాడు!

అతడి చేతి నుండి అప్రయత్నంగానే బ్యాగు జారింది. జాహ్నవి ఒక్క క్షణం గుండె లయ తప్పినా వెంటనే సర్దుకుంది. ముఖం మీద ఎలాంటి భావమూ కనబరచకుండా ఎదురువెళ్లింది.

మారు మాట్లాడకుండా సోఫాలో కూర్చుని కొద్ది క్షణాలు మౌనం వహించాడు.

పిల్లలు స్కూలుకి వెళ్లడం వలన ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. నిజానికి అన్ని నెలలకు తండ్రి వస్తున్నందుకు వారు స్కూలు మానేసి ఎదురు రావలసిందే... అయితే యూనిట్ టెస్టులు జరుగుతున్న కారణంగా వెళ్లాల్సి వచ్చింది.

సుధ తాను రానా అని అడిగితే వద్దంది జాహ్నవి. ఇది తామిద్దరూ చర్చించుకోవలసిన విషయం.

"అయితే నా నుంచి నువ్వు విడిపోవాలని నిర్ణయించుకొన్నావన్నమాట" పదునుగా అడిగాడు.

"నేననలేదు."

"కానీ నేను కాదన్న పని చేస్తే చివరికి అదే అవుతుందని నేను చెప్పాను. అయినా చేశావంటే నాతో కలిసి ఉండాలని నీకు లేదన్నమాటేగా?"

జాహ్నవికి మొండితనం వచ్చింది.

"మీకు నచ్చని విషయాన్ని మీరు కాదనడం, మీరు కాదన్న పని చేస్తే శిక్ష విధించడం- ఏమిటిదంతా? నిర్ణయాలన్నీ మీవే అయితే మరి ఈ సంసారంలో నా స్థానం ఏమిటి అని అడగను. ఎందుకంటే నా స్థానాన్ని నిర్వచించే అధికారం నేను మీకు ఇవ్వడం లేదు. నా స్థానం ఏమిటో నాకు తెలుసు. నేనేం తప్పు చేశానని నన్ను నిల

దీస్తున్నారు? అనుకోకుండా ప్రెగ్నెన్సీ వచ్చింది. తప్పు మనదైనప్పుడు ఫలితాన్ని స్వీకరించాలి.

మీకు ఆడపిల్ల నచ్చకపోతే నేను అబార్షన్ చేయించుకోవాలా? మరి నాకు ఆడపిల్ల కావాలంటే నా కోరిక మాటేమిటి? చంపుకోవలసిందేనా?"

"చంపుకోవలసిందే... ఈ ఇంట్లో ఎర్నింగ్ మెంబర్ని నేను. నేను చెప్పినట్లే నడవాలి..."


"ఏ సంసారంలోనైనా భర్తే ఎర్నింగ్ మెంబరవుతాడు. భార్యాబిడ్డల పోషణ అతని కర్తవ్యం. అదేం ప్రపంచాన్ని ఉద్ధరించడం కాదు. ఉదయం లేచిన దగ్గర్నించి ప్రతి మగాడూ నేను సంపాదిస్తున్నాను, నేను సంపాదిస్తున్నానని రెచ్చిపోతుంటే ఆడదేమైనా ఫ్రీగా దొరికిందా అతడికీ అతడి పరివారానికి సేవలు చేయడానికి?"

"ఈ వాదాలు నాకనవసరం. నా దృష్టిలో పెళ్లాం అంటే మొగుడి మాటకు ఎదురుచెప్పకూడదు. ఇష్టం ఉన్నా లేకున్నా భర్త చెప్పినట్లే వినాలి. తన సొంత అభిప్రాయాలకి ఇక్కడ ఎలాంటి స్థానం లేదు. నీ విలువైన అభిప్రాయాలు నీలోనే ఉంచుకో. తక్షణం నువ్వు, నీ కూతురూ ఈ ఇంట్లోనుంచి వెళ్లిపోండి. నా మాటకు విలువ ఇవ్వని మనుష్యులు నాకవసరం లేదు."

జాహ్నవి మారుమాట్లాడకుండా కూతుర్ని ఎత్తుకుని అక్కడినుంచి వెళ్లిపోయి ఇరువైపులా పెద్దలనీ ఫోన్ చేసి పిలిపించింది.

వచ్చినవారంతా చట్టాలు వివరించి భ్రూణహత్య పాపమని, ఆ ప్రయత్నానికి ప్రోత్సహించాడని తెలిస్తే శిక్ష పడుతుందని వివరించి నచ్చజెప్పి భార్యా కూతురితో కలిసి ఉండేలా ఒప్పించారు.





పెద్దల మాట కాదనలేక అయిష్టంగా ఒప్పుకున్న జగన్నాథ్ కూతురిని మాత్రం స్వీకరించలేదు. ఆ పిల్ల మీద వంద రూపాయలు కూడా ఖర్చు పెట్టనని తెగేసి చెప్పాడు.


రెండు పూటలా పిడికెడు మెతుకులు తప్ప తండ్రి నుంచి ఇంకేం పొందలేకపోయింది ఆ పసిపిల్ల.

సుధ జాహ్నవికి ప్రాణ స్నేహితురాలు. ఆమె ఆ పసిబిడ్డని దత్తపుత్రికగా స్వీకరించింది.

జాహ్నవి, సుధా కలిసి ఆ పసిపిల్లకి 'వైష్ణవి' అని పేరు పెట్టారు. వైష్ణవి చదువు బాధ్యత ఆడపిల్లలు లేని సుధ స్వీకరించింది.

జాహ్నవి ఉద్యోగం చేస్తానంటే ఒప్పుకోలేదు. ఆ విధంగా ఇద్దరు తల్లుల ముద్దుల కూతురయ్యింది వైష్ణవి. దానికి ఆరో ఏడు రాగానే తిన్నగా తీసుకెళ్లి కరాటేలో జాయిన్ చేసింది సుధ.

మంచి వ్యక్తిత్వం ఉన్న ఇద్దరు ఆడవాళ్ల సంరక్షణలో పెరిగి తను కూడా చక్కని వ్యక్తిత్వాన్ని, తెలివితేటలను సంతరించుకుంది వైష్ణవి.



తండ్రి తనను చూసే విధానానికి మనస్సు కష్టపడినా అది చూసి తల్లి ఎక్కడ బాధ పడుతుందో అని తన కన్నీళ్లను రాత్రి పూట తలగడకే పరిమితం చేసింది.

కానీ ఎవరైనా జగన్నాథ్‌గారి అమ్మాయంటే మాత్రం పౌరుషం వచ్చేది. తన అన్నలతో నవ్వుతూ తుళ్లుతూ మాట్లాడేవాడు. తనని చూడగానే ముఖం సీరియస్‌గా పెట్టుకోవడం చూసి చిన్నప్పుడు బాధగా అనిపించినా వయస్సు వస్తున్నకొలదీ ఒళ్లు మండిపోయేది.

అతడిని వెక్కిరించడానికన్నట్లు ప్రతి క్లాసు శ్రద్ధగా చదివి స్కూల్ ఫస్ట్ తెచ్చుకునేది.

అంతేకాదు. ఆ నిరసన, ఆ నిర్లక్ష్యం, ఆ వివక్ష ఆమెకు ఒకవిధమైన కసినీ పట్టుదలనీ రేకెత్తించి గెలవాలనే కోరికను రగిలించాయి. ఆ కారణంగా చిన్నప్పట్నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంది.

ఎక్కడా ఎందులోనూ నేను తక్కువ కాదు అన్న ఫీలింగ్ ఆమె రక్తంలో నిండి అది పట్టుదల, క్రమశిక్షణగా రూపాంతరం చెంది ఆమెను ప్రత్యేక వ్యక్తిగా తయారుచేశాయి.

అందం, చదువు, వ్యక్తిత్వం మూడూ కలగలిపి

నట్లుగా ఉండే వైష్ణవిని కోరి వివాహమాడాడు ఒక యాడ్ కంపెనీ యజమాని అయిన సుధీర్.

జాహ్నవి ప్రాధేయపడగా ఆమె సరసన పీటల మీద కూర్చుని వివాహ తంతు నిర్వహించాడు జగన్నాథ్. ఆమె పెళ్లికి ఎలాంటి ఖర్చు పెట్టవలసిన అవసరం రాక పోవడం దానికి ముఖ్య కారణం.

★ ★ ★

"జాగ్రత్తగా దిగండి నాన్నా!" అంటూ చేయి అందించింది వైష్ణవి.

బంగారుగాజులు, మట్టిగాజులు కలిపి చేతి నిండా వేసుకుంది. ఆ చెయ్యి చూస్తుంటే చిన్ననాటి తన తల్లి చెయ్యి గుర్తుకు వచ్చింది జగన్నాథ్‌కి. వణుకుతున్న చేత్తో ఆ చేయి అందుకున్నాడు.

అతడి పెట్టె, బ్యాగులు సుధీర్ తీసుకుని డ్రైవర్‌కి అందించాడు. చేతి సంచి, కళ్లద్దాలు మనవరాలు తీసు కొచ్చింది.

వృద్ధాశ్రమంలో మిగిలినవారు వీరిని ఆసక్తిగా చూస్తున్నారు. ఏడాది పాటు ఒంటరితనాన్ని అనుభ విస్తూ గడిపిన ఆ రూమ్‌ని ఒక మారు చూసుకున్నాడు జగన్నాథ్.

ముగ్గురు కొడుకులకీ పెళ్లిళ్లు అయ్యాయి. ఏ కోడలూ మామగారు తమతో ఉండడానికి ఇష్టపడలేదు. జాహ్నవి ఉన్నన్నాళ్లూ ప్రతి అవసరాన్ని గమనించి చూసుకునేది. అదృష్టవంతురాలు... ముందుగా వెళ్లిపో యింది.

పెళ్లయిన దగ్గర్నుంచి కష్టం, శ్రమ అంటే ఏమిటో తెలియకుండా గడిచిన జగన్నాథ్‌కి భార్య మృతి, భార్య అంటే ఏమిటో తెలిసేలా చేసింది.

ఆధారపడడం అంటే ఏమిటో అర్థం అయ్యేలా చేసింది. ఏదైనా అందుబాటులో ఉంటే దాని విలువ తెలియదు.

విసుగు లేకుండా ఆమె అన్నీ చేస్తుంటే ఆ రోజు ఆవ గింజంత కూడా కృతజ్ఞతాభావం కలగలేదు.

భార్య అంటే మరి ఇవన్నీ చేయడానికే కదా! అందులో గొప్ప విశేషం ఏముంది? అనుకునేవాడు.

ఆమె నిష్క్రమించిన రెండవరోజు నుంచే తేడా అర్థం అయింది. ఉదయాన్నే నాలుగున్నరకే కాఫీ కావాలి తనకి.

కోడలు ఏడున్నర వరకూ కాఫీ ఇచ్చేది కాదు.

అడగాలంటే మొహమాటం.

అలాగే వంటల్లో కూడా తనకి నచ్చనివి ఏనాడూ వండేది కాదు జాహ్నవి.

అవి తనకి ఇష్టమైనా తన ఒక్కర్తె కోసం చేసుకోవ డానికి ఆసక్తి లేక క్రమంగా మానేసేది.

ఇటు కుటుంబంలో మాత్రం ఎవరికి నచ్చినవి వారికి వండి పెట్టేది. ఎలాంటి వ్యాఖ్యానమూ లేకుండా నిశ్శబ్దంగా అందరికీ అన్నీ అమరుస్తూ పోయేది.

వైష్ణవి చేతికందేవరకూ ఆమె తన శక్తంతా కుటుం బానికి దారపోసింది. వైష్ణవి ఎది గాక కాస్తంత విశ్రాంతి దొరికేది.

అయినా ఏనాడూ శ్రమపడుతున్న భావన ముఖం మీద కనిపించనీయలేదు.

ఎంత మౌనంగా తన పనులు తాను చేసుకుం టున్నా కోడళ్లకి ఎందుకో మామగారు తమతో ఉండడం నచ్చలేదు.

ముగ్గురు కొడుకులూ ముగ్గురు కోడళ్లు అందరూ సంపాదిస్తున్నారు కనుక కాస్త ఖరీదైన వృద్ధాశ్రమం చూసి దానిలో చేర్పేశారు.

బోలెడు దుఃఖం వచ్చింది జగన్నాథ్‌కి.

తనకి కొడుకులూ, కోడళ్లూ, మనవలూ అంతా ఉంటూ ఉండగా తానొంటరిగా ఇక్కడెందుకు ఉండాలి? అన్పించేది.


అందరూ అపరిచితులే... అందరూ వదిలి వేయబడ్డ వారే... అందరూ తమ పిల్లలకి తాము అక్కర్లేనివారే.

వారి సమక్షంలో తనకేం సంతోషం ఉంటుంది? ఇక్కడ చేర్చేముందు తనకో మొబైల్ ఫోన్ కొనిచ్చారు. కొడుకులు తీరిక దొరికినప్పుడు ఓ మూడు నిముషాలు మాట్లాడేవారు.

అందులోనూ పెద్దవాడు పాలిటిక్స్‌లోకి వెళ్తున్నా డేమో వాడికి పెళ్లాంతో మట్లాడ్డా నికి కూడా తీరు

## ప్రియాంక ఆనందం

ప్రియాంకా చోప్రా ఇప్పుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోందిట. ఎందుకంటే ఆమె నటించిన ఫ్యాషన్, దోస్తానా సినిమాలు వరసగా విజయాలు సాధించడంతోపాటు యష్‌చోప్రా బ్యానర్‌లో ఆఫర్ రావడం. బాలీవుడ్‌లో వరసగా చిత్రాలు నిర్మించే యష్‌రాజ్ సంస్థలో పనిచేయాలని అంతా అనుకుంటారు. అంత ప్రెస్టీజియస్ సంస్థలో నటించాలని ప్రియాంక ఎప్పటి నుంచో ఆశపడుతుంటే ఇన్నాళ్లకి ఆ అవకాశం వచ్చింది. యష్‌రాజ్ వారి కొత్త చిత్రంలో ఉదయ్‌చోప్రా సరసన ప్రియాంకను తీసుకోవాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారట.



బాటు ఉండదు. పోనీ తనే చేస్తే, "ఇప్పుడు మీటింగ్‌లో ఉన్నాను. తరువాత మాట్లాడతాను" అని చెప్పి పెట్టేసేవాడు. ఆ తరువాత అనేది వచ్చేది కాదు.

తనకేమో రాత్రి నిద్ర వచ్చేది కాదు. చావు గురించి ఏవో భయాలు వెంటాడుతూ ఉండేవి. ప్రాణం ఎప్పుడు పోతుందో తెలియదు.

ఇలా అపరిచితుల మధ్య దిక్కులేకుండా చావాలని లేదు. కనిపించిన పిల్లల సమక్షంలో తుదిశ్వాస విడవాలని ఉంది.

తన మనస్సేమిటో, అందులో కదలిన భావాలేమిటో వినే ఓపిక, తెలుసుకునే తీరికా ఏ కొడుక్కీ లేదు.

వీళ్లు డబ్బిస్తారు. వాళ్లు తిండి పెడతారు. అది చాలు కదా! అంతకన్నా ఏం కావాలి అన్నది వాళ్ల ధోరణి! డెబ్బై ఏళ్ల జీవితం గడిపి అంతిమ సమయం ఆసన్నమవుతున్న ఈ తరుణంలో పెద్దలకు కావల్సింది కేవలం రెండు పూటలా ఇంత తిండేనా? దానికోసమేనా బ్రతుకుతున్నది?

ఎన్నో నిద్రలేని రాత్రులు కొడుకుల వైఖరి తలుచుకుని నిరాశ చెందాడు. బాధ పడ్డాడు కానీ-

కన్నకూతురిని ఏనాడూ గుర్తు చేసుకోలేదు. అదెలా ఉందని ఎవరినీ అడగలేదు. తెలుసుకోవాలని ప్రయత్నించలేదు.

భర్తతో కలిసి విదేశాలకు వెళ్లిందని ఎవరో అనుకుంటుండగా విన్నాడు. అంతే.

కానీ రాగానే అన్నదమ్ములను తండ్రి గురించి వాకబు చేసి ఆయన వృద్ధాశ్రమంలో ఉన్నాడని తెలియగానే వెంటనే అక్కడకి వచ్చింది వైష్ణవి.

చిక్కి బలహీనంగా ఉన్న తండ్రిని చూడగానే 'ఆడ మనస్సు' కరిగి కంటి చివర చేరింది.

"ఇదేమిటి నాన్నా! ఇంత బలహీనంగా ఉన్నారేమిటి? ఆరోగ్యం బాగా లేదా? తిండి సరిగ్గా తినడం లేదా?" బాధగా అడిగింది.

జగన్నాథ్‌కి నోరు పెగల్లేదు. బాగానే ఉన్నానన్నట్లుగా తల పంకించాడు.

"అసలు... అసలు మీరిక్కడ ఉండడం ఏమిటి నాన్నా! అంత అవసరం ఏమొచ్చింది? లంకంత ఇల్లు పెట్టుకొని ఇలా బయట ఉండడం ఏమిటి? వారీ నిర్ణయం తీసుకునే ముందు ఒక్కమాట కూడా నాతో చెప్పలేదు. మీ గురించి అడిగితే బాగానే ఉన్నారని చెప్పేవారు. సరే, వారి సమస్యల గురించి నాకు తెలియదు. కానీ నాకే సమస్యా లేదు. మీరు నాతో ఉందురుగానీ పదండి..."

"వద్దు... అమ్మా! నాకిక్కడ... బాగానే...ఉంది..."

"కానీ నాకు బాగాలేదు. పిల్లల్లో స్వార్థం, నిర్లక్ష్యం పరాకాష్ఠకి చేరితే తల్లిదండ్రులు ఉండాల్సిన స్థలం ఇది! అంతేతప్ప మానం, అభిమానం ఉన్నవాళ్లెవరూ తమ కన్నవారిని ఇలాంటిచోట వదలరు. అనాథలైన వృద్ధులైతే అది వేరే సంగతి! మీకు నలుగురు పిల్లలున్నారు నాన్నా!" రుద్ధస్వరంతో అంది.

జగన్నాథ్ తల సిగ్గుతో వాలిపోయింది.

జన్మకు కారణం అయ్యాడే కానీ ఏనాడూ లాలనగా చేరదీసింది లేదు- మాట్లాడింది లేదు.

కొడుకులంటూ వారిని అందలం ఎక్కిస్తే వారు అధోగతికి చేర్చారు.

కూతురని చులకన చేస్తే ఈనాడు చేయూతనిస్తానని అంటోంది!

గొంతు పెగుల్చుకుని అన్నాడు. "అలా కాదు తల్లీ! ఇలాంటిచోట ఉన్నా ఫర్వాలేదు కానీ ఆడపిల్ల దగ్గర ఉంటే బాగుండదు."

"ఎందుకు నాన్నా! ఆడపిల్ల అని అలా వేరుచేస్తారు? దానికి బదులు 'పిల్లలు' అనుకుంటే నేనూ ఒకదాన్ని అవుతానుగా? ఆడ అయినా కానీ, మగ అయినా కానీ నిస్సహాయంగా కన్నవారిని వదిలేయడం ఏం న్యాయం? ముసలితనంలో తోడుండకపోతే ఇక ఎందుకు నాన్నా పిల్లల్ని కని పెంచడం? నాకు మీరేం భారం కాదు... నాకు ఇద్దరు బదులు ముగ్గురు పిల్లలనుకుంటాను. మీరు మీ సామాన్లు సర్దుకోండి. నేను మిగతా ఫార్మాలిటీస్ పూర్తిచేస్తాను."

వెళ్తున్న కూతురి వైపు అవాక్కయి చూస్తూ ఉండిపోయాడు జగన్నాథ్.

ఒక గంటలో సుధీర్ కూడా వచ్చాడు అక్కడికి.

వారి ఎదురుగానే అన్నదమ్ములకు ఫోన్ చేసి తండ్రిని తాను తీసుకు వెళ్తున్నట్లుగా తెలియజేసింది వైష్ణవి.

కాళ్లు వణుకుతుండగా అడుగులు తడబడుతున్న తండ్రిని చూసి చేయి అందించింది.

ఒక స్త్రీ జన్మనిచ్చింది- మరో స్త్రీ జీవితం పంచుకుంది- ఇప్పుడు ఒక స్త్రీ అవసాన దశలో కూడా నేనున్నానంటోంది!

భ్రూణహత్యలు చేసి మనం హతమారుస్తున్నది ఆడపిల్లనా? లేక మనం పొందాల్సిన ఆత్మీయతానురాగాలనా?

మాతృత్వానికే మనుగడ లేకపోతే ఈ జగత్తులో మమతకు చోటెక్కడ?



## బిజీ తగ్గాక పెళ్లి!

బిపాషా బసు-జాన్ అబ్రహాం ఎంతో కాలంగా తెగ ప్రేమించేసుకుంటున్న సంగతి అందరికీ విదితమే. అయితే ఇదిగో అదిగో అంటూ వస్తున్న వాళ్ల పెళ్లి గురించి ఇటీవల బిపాషా తేల్చిపారేసింది. మరో రెండేళ్ల వరకూ తాము పెళ్లిచేసుకోమని చెప్పింది. జాన్-తను సినిమాలతో బిజీగా వున్నామని రెండేళ్ల తర్వాత కాస్త ఊపిరి పీల్చుకునేలా ప్లాన్ చేసుకుని అప్పుడు పెళ్లాడదామనుకుంటున్నట్లు తెలియచేస్తోంది బిపాషా. పెళ్లి తర్వాత కాపురం హాయిగా సాగాలంటే ప్రొఫెషనల్ బిజీ కాస్త తగ్గిన తర్వాతే బావుంటుంది అనేది బిపాషా ఆలోచన.